# ఓం శ్రీభద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామినేనమ:
# శ్రీశ్రీశ్రీవీరభద్రస్వామి దేవస్థానము, కురవి గ్రామము, మహబూబాబాద్ జిల్లా
# స్థల పురాణము

మహబూబాబాద్ జిల్లా కేంద్రమునకు 9కి.మీ. దూరమున మహబూబాబాద్ మరిపెడ రాజమార్గములో పెద్ద తటాకమునానుకొని కురవి గ్రామము గలదు క్రీ.శ. 850 ప్రాంతములో వేంగి రాజధానిగా చేసుకొని పాలించు చాళుక్యుల సామంతులైన రాష్ట్రకూట రాజైన భీమరాజు ఈ కురవి (కురవి అనగా గోరింటాకు లేదా ఎరువు అని అర్థము) నగరము రాజధానిగా చేసుకొని పాలించుచున్న కాలములో శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయము నిర్మించినట్లుగా చారిత్రక ప్రతీతి. తదనంతరము కాకతీయ తొలి స్వతంత్ర రాజైన ఒకటవ బేతరాజు జీర్ణోద్ధరణ గావించినట్లు ఆ తర్వాత రెండవ బేతరాజు ఈ కురవి నగరమును ఆనుకొనియున్న పెద్ద తటాకమును త్రవ్వించినట్లు తెలియుచున్నది. విదేశీ యాత్రికుడు మార్కోపోలో వ్రాతల వలన రాణిరుద్రమాదేవి కురవి శ్రీ వీరభద్రస్వామిని దర్శించి శ్రీ స్వామి వారి ఆశీస్సులు పొందినట్లు తెలియుచున్నది. కాకతీయుల పతనానంతరము 17వ శతాబ్దములో నిజాము నవాబుల పాలన క్రిందయున్న ఎన్నో దేవాలయములు రజాకర్లచే కొల్లగొట్టబడినను శ్రీ స్వామి వారి మహిమ వలన ఈ దేవాలయము చెక్కుచెదరలేదని భక్తులు చెప్పుకొనుచున్నారు.

సకలశక్తిమూర్తి వరాల ప్రదాత అయిన శ్రీ వీరభద్రస్వామి వారు పదమటముఖుడై దశహస్తుడై త్రినేత్రుడై రౌద్రపరాక్రమములతో విలసిల్లుతూ దక్షిణ హస్తములలో ఒకటవ హస్తములో ఖడ్గము, రెండవ హస్తములో త్రిశూలము మూడవ హస్తములో పుష్పము, నాల్గవ హస్తములో గద మరియు ఐదవ హస్తములో దండము మరియు వామ హస్తములందు ఒకటవ హస్తములో ఢమరుకము, రెండవ హస్తములో సర్పము, మూడవ హస్తములో విల్లు, నాల్గవ హస్తములో బాణము మరియు ఐదవ హస్తములో ముద్గరము ధరించి భక్తుల పాలిటికల్పతరువుగా, పిలిచిన పలికే దైవముగా వెలుగొందుచున్నాడు.

శ్రీ స్వామివారి పాదముల క్రింద నందీశ్వరుడు శ్రీ స్వామివారి వాహనముగా దర్శనమివ్వగా శ్రీస్వామి వారికి ఎడమవైపు చతుర్ భుజములు కల్గి శ్రీ భద్రకాళీ అమ్మవారు వెలిసియున్నారు. శ్రీ వీరభద్ర స్వామివారి ఆయుధం పేరు పట్టేశం. వేయి చేతులు కలిగి అనేక ఆయుధములు శస్త్రాస్త్రములు ధరించిన సంపూర్ణ రుద్ర స్వరూపుడు, సమస్తములైన భూత, ప్రేత, పిశాచ, గణాలు, శాకినీ, ఢాకినీ, కామినీ, వంటి ప్రథమ గణ పిశాచాలు ఈయన ఆధీనము రుద్రగణాలు ఈయనను సేవిస్తాయి. విపత్కర సమయంలో దిక్కుతోచని పరిస్థితిలో భక్తులను ఆదుకొనే పరమభోళామూర్తి, సమస్త క్షుద్రగణాలకు వీరభద్రుడంటే పరమ భయం స్వామిని తలంచిన వారికి, సేవించిన వారికి పిశాచ బాధలు, సర్వదోషాలు, క్షుద్ర శక్తులు దరిజేరవు. పిశాచగణాలకు అధిపతి అంటే వాటిని ప్రోత్సహించే వాడని అర్థం కాదు. అమంగళమైన శక్తులన్నింటికి వీరభద్రడంటే మిక్కిలిభీతి అని గ్రహించండి. అందరి కోరికలు తీర్చేవాడు పరమేశ్వరుడైతే ఆయన ఆదేశాన్ని అనుసరించి దక్షుని యజ్ఞాన్ని సర్వనాశనం చేసి శివునికే మానసిక ఉపశమనాన్ని కలుగజేసిన మహత్తర పరాక్రమవంతుడు శివ మానస పుత్రుడు శ్రీ వీరభద్రుడు.

శ్రీ భద్రకాళీ అమ్మవారికి కుడివైపు మొదటి హస్తమున త్రిశూలం, రెండ హస్తములో సల్పసిద్దితో హృదయాన్ని స్పందింపచేయునట్లుగా సదా అభయమిస్తూ వామహస్తములలో మొదటి హస్తములో పద్మము, రెండవ హస్తముతో భువిని శాశ్వతముగా నిలుపుమని ఆశీర్వదించినట్లు దర్శనమిచ్చుచున్నది. నిరీశ్వర దక్షయజ్ఞ కారణంగా పరమేశ్వరుని సంకల్పంతో జన్మించిన వీరభద్రుడు మహోగ్రస్వరూపుడైన అఖండ మహిమాన్వితుడు. కొలిచే భక్తులకు స్వామి ప్రసాదించే వరాలు, లీలలు, అనేకం శ్రీస్వామి వారి కుడివైపు కొద్ది సమీపములో విజయగణపతి వెలిసియున్నాడు. శ్రీస్వామి వారి మండములో సమాంతరముగా ఇరువైపుల పరమశివుడు (లింగాకారము) వెలసియున్నాడు. ఉత్తరమున శ్రీ రామలింగేశ్వర స్వామి దక్షిణమున శ్రీచంద్రమౌళేశ్వరస్వామి రూపంలో వెలిసియున్నారు.

శ్రీ స్వామివారి ఆలయ మంటములోకి ప్రవేశించగానే మనకు మొదట శ్రీఅనుజ్ఞ గణపతిస్వామి వారు దర్శనమిస్తారు అనుజ్ఞ గణపతిని ద్యానించి తదుపరి శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకొని తదుపరి వీరభద్ర స్వామి వారిని అమ్మవారిని దర్శించుకొని తదుపరి వీరభద్ర స్వామి వారిన అమ్మవారిని దర్శించుకొని తదనంతరము శ్రీచంద్రమౌళీశ్వర స్వామి వారిని దర్శించు కొందరు తరువాత సమీపములో గల సప్తమాత్రుకలు దర్శించి బయటికి పోవుదురు.న ఈ ఆలయమునకు దక్షిణ దిశలో ప్రాకారము బయత శ్రీభద్రకాళీ అమ్మ వారు స్వయం వ్యక్తమూర్తిగా వెలసి భక్తుల కోర్కెలను తీర్చి అనేక పూజలందుకొనుచున్నది. ఆలయమునకు పడమర దిశగా కొద్ది దూరములో మహబూబాబాద్-మరిపెడ రాజ మార్గమునానుకొని శ్రీనాగేంద్రస్వామి ఆలయము గలదు. శ్రీనాగేశ్వరస్వామిని గూడ భక్తులు తప్పనిసరి దర్శించి పూజింతురు. మరియు ఈ దేవాలయమునకు ఉప ఆలయములుగా గ్రామములో శివాలయము మరియు దేవాలయ సత్రముల వద్ద శ్రీ ఆంజనేయస్వామి ఆలయములు గలవు. ఈ ఆలయములల కూడ భక్తులు పూజలొనర్చెదరు.

కురవి దేవాలయంలో నిద్రచేయడం తడి బట్టలతో స్వామివారి దేవాలయం చుట్టూ ప్రదక్షణ చేయడం భక్తులకు ఆనవాయితీ, ఆచారం. జీవితంలో ఒక సారైనా కురవి శ్రీ వీరభద్రస్వామిని దర్శించినచో పరమశివుడిని దర్శించిన ఫలితం కలుగుతుందని భక్తుల నమ్మకం.